# నేహాల



సాయిబ్రహ్మానందం గొర్తి

# చరిత్రకి బలైన స్వేచ్ఛ కథ

(గత సంచిక నుంచీ తరువాయి)

## 12

**బయటకు కనిపించని దుఃఖంతో మంచమ్మీద ఒరిగిపోయింది నేహల.**

పెను తుఫాను తాకిడికి కూలిన వృక్షాల్లా అందరూ తలో మూలా కూలబడ్డారు. ఇల్లంతా నిశ్శబ్దపు నీడలే ఆవరించుకున్నాయి.

వరండాలో ఉయ్యాలబల్లపై వాలిపోయాడు హరీంద్ర. నేహల తల్లి కూడా అక్కడే ఉండిపోయింది. ఎవరెవరితోనూ మాట్లాడ లేదు. చాలా సేపు మౌనంగా ఉండిపోయారు.

నేహల ఎందుకు ఈ వివాహాన్ని ఇష్టపడటంలేదో అర్థంకావడంలేదు తండ్రికి. తను ముద్గల్లో ఒక సామాన్య రైతు. ఉన్న ఆరెకరాలూ సేద్యం చేసుకుంటూ, దానిపై వచ్చే దాయంతో గడుపుకొస్తున్నాడు. తన స్థోమతకి తగ్గ వరుణ్ణి తీసుకొచ్చేవాడు. మహా అయితే తనకంటే కాస్త సంపన్నుల సంబంధం వెతికేవాడు. అలాంటిది ఇవాళ మహారాజు తన గుమ్మం తడితే తన కూతురు వద్దంటోంది. ఇదే మరో ఆడపిల్లయితే ఎగిరి గంతేస్తుంది. మరెందుకు తన చిట్టి తల్లిలా మొండికేస్తోంది. పుట్టి బుద్ధెరిగాక నేహల కంట నీరు చూడలేదు తను. నేహలా అలాంటి అవసరం రాకుండానే పెరిగింది. పెంపంకానికే వన్నె తెచ్చేలా మసలుకునేది నేహల. సభ్యతా, సంస్కారమూ, విద్యా, వినయమూ, నిష్కర్షా, న్యాయమూ ఒకటేమిటి అన్ని సుగుణాలు కలబోసిన రూపం నేహలని తను మురిసిపోయేవాడు. ఊళ్ళోవాళ్ళకి తనెప్పుడు ఎదురుపడినా నేహల లాంటి అమ్మాయి ఉండదనే ప్రస్తావనతోనే తన పలకరింపు ఉండేది. అలాంటిది ఒక తెలివితక్కువ పిల్లలా నేహల ఇలా ప్రవర్తించడం తనకే ఆశ్చర్యంగా ఉంది.

ఏమవుతోందో అతనికి అర్థం కావడం లేదు. ఉదయాన్నే పొలానికి వెళ్ళడమూ, సాయంత్రం వేదరాయ శర్మ రావడమూ, మహారాజు దేవరాయలు పంపిన హ్వానాన్ని చెప్పడమూ, తనూ సరేననడమూ, నేహల కాదనడమూ ఇలా ఒకదాని వెంబడి మరొటి వేగంగా జరిగిపోయాయి. ఇందులో ఎవరి ప్రమేయం ఎంతుందో తెలీదు. తన ఊహక్కూడా అందడం లేదు. నేహల ఎందుకు కాదంటూందో ఎంత ఆలోచించినా తెగడం లేదు.

తన కూతురు తెలివైనదని అతనికి తెలుసు. ఏదో బలమైన కారణం లేకపోతే కానీ ఇటువంటి నిర్ణయం తీసుకోదు. ఇదే విషయం మెల్లగా కూతుర్నే అడిగితే తెలుస్తుందనుకుంటూ మెల్లగా నేహల గది వైపు వెళ్ళాడు. దిండులో తలదాల్చుకొని కనిపించింది నేహల.

మెల్లగా దగ్గరకెళ్ళి భుజమ్మీద మెల్లగా చెయ్యి వేసి మంచమ్మీద కూర్చుంటూ, "అమ్మా నేహలా!" అంటూ మెల్లగా పిల్చాడు.

ఒక్కసారి తల తిప్పి చూసింది నేహల. ఒక్క ఉదుటన లేచి తండ్రి వళ్ళొ తలవాల్చింది.

"అప్పా!" అంటూ గట్టిగా కావలించుకొని ఏడవడం మొదలు పెట్టింది. కూతురి కంట కన్నీళ్ళు చూసి కరిగిపోయాడు హరీంద్ర.

"ఏంది తల్లీ! ఏమయ్యింది? నీకిష్టంలేకపోతే సరే! ఎందుకమ్మా ఈ దుఃఖం?" మాటలు తడబడుతూ వచ్చాయి.

నేహల సమాధానం చెప్పలేదు. ఇంతలో నేహల తల్లి  గదిలోకొచ్చింది. ఆమెను చూస్తూనే భోజనం పట్టుకురమ్మనమని సౌంజ్ఞ  చేసాడు భార్యకి. అమె అలాగేనని తలూపుతూ వెనక్కి వెళ్ళింది.

"అప్పా! నన్నెప్పుడూ వదిలుండనని మాటివ్వప్పా!"

ఊహించని  ప్రశ్నకి ఏం చెప్పాలో తెలీలేదు హరీంద్రకి. అలాగేనని మెల్లగా అన్నాడు. కానీ అది అసాధ్యమని అతనికీ తెలుసు.

"లేచి మొహం కడుక్కో! వేదరాయశర్మ గారికి రేపుదయం కబురు పంపుతాన్లే!" అని అన్నాడు.

ఇంతలో నేహల తల్లి పళ్ళెంలో భోజనం పట్టుకొచ్చింది.

అన్నమూ, కూరా కలిపి ముద్దలు చేసి మెల్లగా నేహల నోట్లో పెట్టాడు.

"ఇంద! ఈ రెండు ముద్దలూ తిను. ఎందుకొచ్చిన ఆలోచనల్లమ్మా ఇవి?" అప్రయత్నంగా అన్నాడు.

నేహల రెండు మూడు ముద్దలు తిన్నాక మెల్లగా అంది.

"అప్పా! అందరి ముందూ నేనలా ప్రవర్తించకుండా ఉండాల్సింది. అనవసరంగా గురువుగారి ముందు నీకు చిన్నతనం కలిగేలా ప్రవర్తించాను.  ఆవేశానికి ఆలోచన ఉండదు. వివేకం అంతకన్నా ఉండితీరదు. నన్ను క్షమించు."

"క్షమాపణలేమిటి తల్లీ! అది వదిలేసెయ్యి. హాయిగా సంతోషంగా ఉంటే నాకదే చాలు." కూతురు మామూలు స్థితికొచ్చిందన్నది గ్రహించాడు హరీంద్ర.

"అలాగే అప్పా! వదిలేస్తాను. కానీ నాదే పొరపాటు. అనవసరంగా నీమీదా, అమ్మమీదా కోపగించుకున్నాను."

ఇదే అదననుకున్నాడు. కూతురు సాంతంగా ఉండగానే విషయం అడిగితే చెబుతుందనుకున్నాడు హరీంద్ర.

"ఏం తల్లీ? ఎందుకంత కోప్పడ్డావ్? నీకేమయినా తక్కువ చేసానా?" అతని మాటలు పూర్తి కాకుండానే కాదన్నట్లు నోటికి చెయ్యడ్డం పెట్టింది నేహల.

"అప్పా! తక్కువా, ఎక్కువా అన్న ఊహే నాకు రాదు. పుట్టి బుద్ధి ఎరిగాక నిన్నూ, అమ్మనీ చూసి పట్టరాని ఆనందంవచ్చేది. ఎందుకో తెలీదు. మీరు నన్ను పువ్వుల్లో పెట్టి పెంచారన్నది కాస్త వయసొచ్చాక అర్థమయ్యింది. మీరెంతో ఆప్యాయంగా, పల్లెత్తు మాటనకుండా ఎంతో సౌశీల్యతతో పెంచారు. ఈ సంగతి నా స్నేహితురాళ్ళని చూసాక మరింత బోధ పడింది. ఎన్నో ఆంక్షలతో, కట్టుదిట్టాలతో అమ్మాయిలని పెంచే కుటుంబాల్లా కాకుండా నాకు నచ్చినవే నువ్వు నేర్పించావు. నాట్యమయినా, సంగీతమయినా నా ఇష్టాలకనుగుణంగానే నువ్వు ప్రోత్సహించావు. ఒక మనిషికి కావల్సిన స్వేచ్ఛనీ, స్వాతంత్ర్యాన్నీ నాకిచ్చావు. నీతో పొలంకి వస్తానన్నా, అశ్వత్థనారాయణ స్వామి ఆలయానికి వెళతానన్నా, నా స్నేహితురాళ్ళింట్లో ఎంతో కాలం గడిపినా ఎప్పుడూ మీరు ఆంక్షలు పెట్టలేదు. ఒక ఆడపిల్లకి ఇంతకంటే ఏం కావాలి అప్పా? అందమైన ప్రకృతి మధ్య స్వేఛ్ఛా విహంగంలా పెంచారు నన్ను. స్వచ్ఛమైన సరస్సులో చేపపిల్లా పెరిగాను. అందమైన ఉద్యానవనంలో బంగారు జింకలా మసిలాను. పుట్టాక ఏ మనిషికైనా ఇంతకంటే ఏం కావాలి అప్పా? ఇక్కడ మీతో గడిపిన ప్రతీ క్షణమూ నా జీవితంలో ఒక మధురానుభూతే! మిమ్మల్ని విడిచి ఒక్క క్షణం కూడా ఉండలేని పరిస్థితికొచ్చాను. వయసొచ్చిన ప్రతీ ఆడపిల్లా మంచి మొగుడు కావాలనీ, సంపన్నుడు కావాలనీ కోరుకుంటుంది. నాకలాంటి కోరికలేం లేవు. హాయింగా, సంతోషంగా మీ మధ్య గడిపితే చాలు. బ్రతికినన్నాళ్ళూ నేను నేనులా బ్రతికితే చాలు. నిజంగా నాకింతకు మించి కోరికలు ల్లేవు."

కూతురి మాటలు అర్థమయ్యి అర్థమవనట్లున్నాయి హరీంద్రకి.

"అలాగెలాగమ్మా? ఎల్లకాలమూ మేముంటావా? ఎప్పటికయినా ఆడపిల్లన్నాక పెళ్ళి చేసుకొని అత్తారింటికెళ్ళాల్సిందే కదమ్మా? మీ నాయనమ్మ నిన్ను చూసి ఎంత ముచ్చటపడేదో మేమూ నీ సంతానంచూసి ఆనందించాలనుకోడం తప్పుకాదు కదమ్మా?"

"తెలుసప్పా! మీరు చెప్పే వన్నీ నాకు తెలుసు. నేను పెళ్ళి చేసుకోనని ఎప్పుడూ అనలేదుకదా? నీకెందుకీ సందేహమొచ్చింది?"

"అన్నీ తెలిసి మరెందుకమ్మా నిక్షేపంలాంటి మహారాజుతో వివాహాన్ని కాదన్నావు? మా స్థాయికి అంత పెద్ద సంబంధం తీసుకురాగలనా చెప్పు. ముచ్చటపడి మహారాజే మన గుమ్మం తొక్కాడు. కాదంటావా?"

"నాకు మహారాజుతో వివాహం సుతారామూ ఇష్టం లేదు. కారణం మహారాజూ కాదు; గురువు గారూ కాదు. నాకా రాణివాసపు బ్రతుకంటేనే అసహ్యం!" పళ్ళుకొరుకుతూ అంది.

"రాణివాసపు బ్రతుకంటే అసహ్యమా? ఎవరైనా వింటే నవ్వి పోతారు. అడుగులకి మడుగులొత్తే పరిచారికలూ, అందలమెక్కించే సౌకర్యాలూ, ఒకటేమిటి? ఆ భోగమే వేరమ్మా! రాణివాసమంటే భోగ మందిరమమ్మా?"

"భోగమందిరం కాదప్పా! అదొక భోగ పంజరం! స్వేచ్ఛకి భరణాలూ, అలంకారాలూ అమర్చిన కారాగార జీవితం అది. పైకి నీకు అవే కనిపిస్తున్నాయి. కానీ లోపల బ్రతుకు వేరు నాన్నా! అంతఃపుర అందాలేకానీ, అందులో ఉండే ఆంక్షలు నీకు తెలీదు. ఎక్కడకి వెళ్ళాలన్నా మహారాజు అనుమతి కావాలి. మనల్నీ, మన జీవితాల్నీ అంటిపెట్టుకొని వందలమంది సైనికులూ, పరిచారికలూ ఉంటారు. అనుక్షణం అనుసరిస్తూనే ఉంటారు. కావాల్సిన స్వేచ్ఛ ఉండదు. పైగా ఈ రాజులకి రాజ్యమూ, పరిపాలనా పైనుండే శ్రద్ధ రాణులపై ఉండదు. పెళ్ళయిన కొత్తలో ఉన్నా తరువాత మిగిలేది ఒంటరి బ్రతుకే! గుర్రపు రౌతు తలుచుకుంటే దెబ్బలకు కొదవా అన్నట్లు రాజు తలుచుకుంటే పెళ్ళిళ్ళకి కొదవా? నాపై మోజు తగ్గగానే పక్కనున్న రాయచూర్లోనో, గంగావతిలోనో మరో అమ్మాయి దొరుకుతుంది. నాకు జరిగబోయే తంతే వాళ్ళకీ జరుగుతుంది. ప్రభా వాళ్ళ బంధువొకమ్మాయికిలాగే మహారాజు కొలువులో ఉన్న రాజ్యాధికారికిచ్చి పెళ్ళి చేసారు. ఏడాది తిరక్కుండానే అతను మరో వివాహానికి సిద్ధమయ్యాడు. అది తట్టుకోలేక అమ్మాయి రాజభవనం పై నుండి దూకి చచ్చిపోయింది. అయినా ఈ రాజుల జీవితాలకీ ఢోకా ఏమీ లేదు. ఎప్పుడు శత్రువులు దండెత్తుతారో తెలీదు. ఒకవేళ యుద్ధంలో పరాజయం వస్తే శత్రురాజులు మొట్టమొదట కన్నేసేది అంతఃపురం వైపే! ఆత్మత్యాగమైనా చేసుకోవాలి లేదా మరో మగాడికి ఆలిగానయినా బ్రతకాలి. పైకి కనిపించేటంతటి ఆనందకర జీవితం కాదప్పా? సౌకర్యాలుండచ్చు. భోగభాగ్యాలుండచ్చు. ఇవన్నీ ఎంత ధనం వెచ్చించయినా కొనుక్కోవచ్చు. కానీ స్వేచ్ఛ మాత్రం ఉండదు. అంతెందుకు - మిమ్మల్ని ఎప్పుడు కలవాలంటే అప్పుడు చూడగలనా? ఒకవేళ మీరు అంతఃఅపురంలో ఉందామనుకున్నా మహారాజు అంగీకరించరు. ప్రతీ పనికీ అనుమతులూ, అస్కారమూ కావాలి. పరిచారికల మధ్య ఒంటరి జీవితాన్ని గడపడానికి నేను సిద్ధంగా లేనప్పా! అందుకే వద్దన్నాను."

కూతురు మాటలువిని నిశ్చేష్టుడయ్యాడు హరీంద్ర. అతనికి కొంచెం కొంచెంగా అర్థమయ్యింది.

అంతా విని ఏం మాట్లాడాలో తెలియ లేదు. మౌనంగా ఉండిపోయాడు. అది చూసి నేహలే మరలా అంది.

"అప్పా! నిన్నూ, అమ్మనీ విడిచి నేనుండలేను. ఎప్పుడు కావాలంటే అప్పుడు నేను మిమ్మల్ని చూడగలగాలి. మనింటికి ఎప్పుడైనా నేను రాగలిగేలా వుండాలి. ఇదంతా ఎందుకు కానీ! నాకు రాణివాసపు జీవితమ్మీద కోరిక లేదు. మహారాజుపైన మనసంతకన్నా లేదు. ఒకవేళ మహారాజు సిద్ధపడినా నేను సిద్ధంగా లేను. నాకు నా జీవితం ముఖ్యం. సౌకర్యాలు కాదు. నీకు తెలియడం లేదప్పా! నువ్వు నన్ను అత్తారింటికి పంపడం లేదు. ఒక అధికార వేశ్యావాటిక్కి పంపుతున్నావు. ఇప్పటికే మహారాజుకి మూడు పెళ్ళిళ్ళయ్యాయి. ఇప్పుడిది నాలుగోది. కొన్నేళ్ళు పోయేకా నేనూ మొదటి ముగ్గురి జాబితాలోకి చేరిపోతాను. మహారాజుకీ నాకు వయసులో ముప్పయ్యేళ్ళ పైగా వత్యాసముంది. మహారాజుకి నా ఈడు కూతురుంది. ఇంత వయసు భేదంతో జరిగే పెళ్ళితో ముడిపడేవి శరీరాలు తప్ప జీవితాలు

కాదు. అప్పా, నీకంతగా  రాజభోగాలమీద మక్కువుంటే కత్తి తీసుకొని ఒక్క వేటేసెయ్యి. సంతోషంగా భరిస్తాను. అంతే కానీ ఇలా ఈ పెళ్ళి పేరు చెప్పి నన్ను బలిపశువుని చెయ్యద్దు."

కూతురి మాటలు విని చలించిపోయాడు హరీంద్ర. ఒక్కోటీ మెల్ల మెల్లగా అవగతమవుతున్నాయి. నేహల చెప్పేదీ నిజమేననిపిస్తోంది.

ఎదురుగా తల్లి కూడా శ్రద్ధగా కూతురి చెప్పిన మాటలు వింది. వింటూన్నంత సేపూ ఆమె కంట కన్నీరు కారుతూనే వుంది.

నేహల చెప్పింది హరీంద్ర బుర్రకెక్కింది. కూతురు ఎంతో ఆలోచించే మహారాజు ఆహ్వానం వద్దందన్న భావన కలిగింది. కారణాలు తెలిసాయి. నిజానిజాలు బేరీజు వేసుకున్నాడు.

"నువ్వు చెప్పినట్లు మేం ఆలోచించ లేదు తల్లీ! ఎందుకు ఈ పెళ్ళి వద్దంటున్నావో మాకు అర్థం కాలేదు. పోనీలేమ్మా! రేపుదయం వేదరాయశర్మ గారికి ఈ పెళ్ళి కుదర్దని చెబుతాను. ఇంద ఈ రెండు ముద్దలూ తిను" అంటూ కూతురి నోట్లో అన్నం ముద్దలు పెట్టాడు.

"చూసావా అప్పా! ఇలా నీ చేత గోరుముద్దలు తినడం అంతఃపురంలో నేనుంటే లభిస్తుందా చెప్పు? ఈ స్వేఛ్ఛా, సంతోషమూ అక్కడికెళితే వస్తాయా? ఈ ఆనందం ముందు అవన్నీ కూలిపోతాయి."

కూతురి మాటలు విని దగ్గరకు తీసుకున్నాడు హరీంద్ర. కొడుకు పుట్టలేదన్న కొరత లేదతనికి. 'నేహల్లాంటి బంగారం ఎన్ని జన్మలెత్తితే దొరుకుతుంది?' అని అనుకున్నాడు. మనసు తేలిక పడింది.

**0000000000**

కూతురి అభీష్టానికి వ్యతిరేకంగా తను మహారాజుతో పెళ్ళి చెయ్యడానికి సిద్ధంగా లేడు.

మర్నాడు ఉదయం మహారాజిచ్చిన కానుకలన్నీ ఎడ్లబండిలో వేసుకొని దేవరాయలింటికి బయల్దేరాడు. బండిలో పెట్టడానికి నేహలా సహాయం చేసింది. వెళ్ళడానికి సిద్ధ పడుతూండగా, నేహల తనూ వస్తాననంది. ముందు వద్దన్నా, నేహలయితే ఈ పెళ్ళికి అంగీకారం లేదన్న విషయం స్పష్టంగా చెప్పగలదని అనుకొని సరే రమ్మనమని చెప్పాడు.

ఉదయాన్నే హరీంద్రా, నేహలా రావడం చూసి అంతా సవ్యంగానే జరిగిందనుకున్నాడు వేదరాయశర్మ. కానీ తమ నిర్ణయాన్ని చెప్పాడు హరీంద్ర. అది విని ఉవ్వెత్తున లేచాడు వేదరాయశర్మ.

"ఏంటి హరీంద్రా? ఈ పరాచికాలు. మహారాజుతో వ్యవహారమంటే ఏమనుకుంటున్నావు? ఈ విజయనగరాధిపతి – ఆయనంతట ఆయన స్వయంగా ఆహ్వానం పంపితే కాదనడానికెన్ని గుండెలు? మహారాజు తలుచుకుంటే ఏదైనా చెయ్యగలరు? నీకూతురికెలాగూ మతి లేదు. నీ బుద్ధి ఏమయ్యింది? వెనకటికి నీలాంటి పెద్ద మనిషికి పిలిచి పిల్లనిస్తానంటే గాడిద పాలు తెమ్మన్నాడట. అలా వుంది నీ వ్యవహారం చూస్తుంటే! విజయనగర మహారాణి అంటే ఏమనుకుంటున్నావు? పది జన్మలెత్తినా అటువంటి స్థానం దొరకదు. మహరాజు ముందు నా పరువు తీసారు. ఛీ! ఛీ! బుద్ధి తక్కువ మనుషులు!" అంటూ కసురుకున్నాడు.

ఇది విని నేహలకి కోపం వచ్చింది. గురువుగారి మీద గౌరవంతో కోపం పైకి కనబడనీయకుండా మెల్లగా ఇలా అంది.

"ఇందులో మా నాన్న ప్రమేయం ఏమీ లేదు. నాకు ఈ వివాహం సమ్మతం కాదు. నేనెప్పుడూ మహారాజుని చూళ్ళేదు. ఆయన నన్ను చూసుండరనే అనుకుంటున్నాను. నేనిష్టపడని వ్యక్తితో ఏడడుగులు వేయడానికి నేను సిద్ధంగా లేను. పైగా మహారాజుకి ఇప్పటికే ముగ్గురు రాణులున్నారు. పైగా రాణీ వాసమంటే నాకు మక్కువలేదు. మీరు మాయందు అభిమానంతో ఈ సంబంధం

తెచ్చారు. కానీ అది అందుకునే అర్హతా, శక్తీ మాకు లేవు. ఇది నా నిర్ణయం. అందువల్ల ఏమయినా అనదల్చుకుంటే నన్ను దూషించండి. అంతే కానీ మా నాన్నని అనద్దు. పాపం ఆయన అమాయకుడు..."

నేహల సమాధానం విని వేదరాయశర్మకి మరింతకోపం పెరిగింది.

"నిన్ను చూసి ఏమనుకుంటున్నావు నేహలా? ఆడదానికంత అహంకారం పనికి రాదు. నీకు మతి భ్రమించినట్లుంది. అందుకే ఇంటికొచ్చిన లక్ష్మిని కాలితో తన్నుతున్నావు. ఈ పొగరుతో జీవితాన్ని నాశనం చేసుకుంటున్నావు. మహారాజు ఆగ్రహిస్తే నిన్నూ, మీ నాన్ననీ బందీగా తీసుకెళ్ళ గలడు. నీ మెడలు వంచి మరీ తాళి కట్టగలడు.."

నేహల తన కోపం నిగ్రహించుకుంది.

"బెదిరిస్తున్నారా, గురువర్యా? బందీగా చెయ్యగలడేమో కానీ నన్ను భార్యగా ఎవ్వరూ చేసుకో లేరు. అదే పరిస్థితి వస్తే నా శవానికి తాళి కడతారేమో నాక్కాదు. మీరు పెద్ద వారు. మమ్మల్నీ, మా ఇష్టాల్నీ అర్థం చేసుకోండి. మా బ్రతుకు మమ్మల్ని బ్రతకనీయండి. స్వేచ్ఛ లేని బ్రతుకు మాకొద్దు." అని తక్కువ స్వరంతోనే మెల్లగా అంది.

"ఏదో అనుకున్నాను నేహలా? నువ్వు చాలా గడుసరివి. లేకపోతే పట్టుమని ఇరవై ఏళ్ళు లేవు. స్వేచ్ఛట, స్వేచ్ఛ! మహారాణిగా దొరకని స్వేచ్ఛ నీకిక్కడ దొరుకుతుందా? చెప్పాల్సింది చెప్పాను. మీ ఇష్టం. మహారాజుతో వచ్చే పరిణామాలకి మాత్రం నేను బాధ్యుణ్ణి కాను. అయినా ఎవరిమీదో ప్రేమతో నీవా మాటలంటున్నావని నాకు తెలుసు." రేవన్న పేరు ప్రస్తావించకుండా సూచన ప్రాయంగా పైకన్నాడు.

"వచ్చేవాడెవరయినా సరే నా స్వేచ్ఛకి భంగం కలిగిస్తే నేను ఒక్క క్షణం కూడా భరించను. ఎదుటివారి స్వేచ్ఛని గౌరవిస్తేనే ప్రేమ పుడుతుంది. అది లేన్నాడు వాళ్ళిద్దరి మధ్యా ఉండేది ప్రేమ కాదు; ఆకర్షణ. ఇది నా బ్రతుకూ, నా ఇష్టం. దయచేసి మమ్మల్ని మా జీవితాలు గడపనీయండి."

వేదరాయశర్మ భార్యా, ఇంటికొచ్చిన అతిధిలూ అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు. నేహల వాదాన్నీ విన్నారే కానీ ఎవరూ నోరిప్పలేదు.

చివరగా హరీంద్రే అన్నాడు.

"అయ్యా సామీ. అది చిన్న పిల్ల. దాని మాటలు పట్టించుకోకండి. మహారాజు గారు పంపిన కానుకలు వెనక్కి తెచ్చాను. అవి అందుకునే అర్హతా, స్థాయీ మాకు లేవనీ మహారాజుగారికి విన్నవించండి. ఈ పెళ్ళికి అంగీకారం చెప్పకపోవడానికి కారణం మేమే కానీ మహారాజు కాదని మా మాటగా చెప్పండి. రాణివాస జీవితం మా అమ్మాయి తట్టుకోలేదని చెప్పండి. ఒక కన్నతండ్రిగా ప్రాధేయపడుతున్నాను. మమ్మల్ని ఒదిలేయండి." అంటూ చేతులెత్తి నమస్కరించాడు.

వేదరాయశర్మ ఇహ పొడిగించలేదు. పొడిగించీ లాభం లేదన్న సంగతి అర్థమయ్యింది. పైన నేహలా ఏమీ మాట్లాడ లేదు.

వెళుతూండగా వేదరాయశర్మే అన్నాడు.

"హరీంద్రా! తెలిసీ తెలియక నువ్వు చాలా పెద్ద తప్పు చేస్తున్నావు. నీకెన్నో సార్లు చెప్పిన ఫలితం లేకపోయింది. సరే మీ ఇష్టం. మహారాజుకి మీ విషయం అందజేస్తాను. ఈ సాయంత్రం లోగా మీ మనసూ, నిర్ణయమూ మారితే కబురు పంపించు. లలాట లిఖితాన్ని ఎవరూ తప్పించ లేరు. ఏం చేస్తాం?"

అలాగేనని చెప్పి సెలవు తీసుకున్నాడు హరీంద్ర. వెనుకనే నేహలా అనుసరించింది.

స్వేచ్ఛకి తండ్రిలా అతడూ, ప్రేమకి ప్రతీకలా ఆమే ఇంటి ముఖం పట్టారు.

**000000000**

నేహలా, తండ్రీ వెళ్ళగానే అక్కడున్న బల్లమీద కూలబడ్డాడు. మహారాజుకి ఎలా కబురు పంపాలా? అని సతమతమవుతున్నాడు. ఎంత ఆలోచించినా నేహలా, తండ్రీ ఎందుకు మహారాజు ప్రతిపాదనని తిరస్కరిస్తున్నారో అర్థం కావడం లేదు. మొదటనుండీ నేహల ఒప్పుకోదన్న శంక ఎలాగూ ఉంది. రేవన్నపై ప్రేమ కోసమని తిరస్కరించే అవకాశముందనుకున్నాడు. కానీ నేహల చెప్పిన కారణం వేదరాయశర్మని ఆశ్చర్యపరిచింది. కారణాలూ, వివరణలూ ఏదయితేనే మహారాజు వద్ద తన మాట వీగిపోయింది. హరీంద్ర ఇంటికెళ్ళినప్పుడు వాళ్ళ కళ్ళల్లో ఆనందం చూసి ఈ వివాహం జరిగి తీరుతుందనీ ఆశ పడ్డాడు. పట్టుమని పద్దెనిమిదేళ్ళు దాటాయో లేదో నేహల ఇంత స్పష్టంగా తన ఇష్టాయిష్టాలని చెప్పగలిగే ధైర్యం ఎక్కడనుండొచ్చింది. ఏ ఇంటా అమ్మాయిలు నోరిప్పరు. పెద్దలు చెప్పిన మాటనే శిరసావహిస్తారు; ముఖ్యంగా వివాహ విషయం వచ్చేసరికి. పెద్దల మాట జవదాటరు. వయోతారతమ్యం వున్నా ఎవరూ పట్టించుకోరు. వంశాలు నిలపడానికి కొంతమంది పెళ్ళిళ్ళు చేస్తే, ఎవరైనా బలం చూపి ఏ అఘాయిత్యమయినా చెయ్యొచ్చేమోనన్న నెపంతో రజస్వల కాకుండానే పెళ్ళి పీటలెక్కిస్తారు మరికొంతమంది.

నేహల చెప్పినదాన్ని బట్టి చూస్తే ధైర్యం కంటే పొగరే ఎక్కువగా కనిపిస్తోంది. తనొక అందగత్తెనని గర్వమా? లేక తన మాటే చెల్లాలన్న మొండితనమా? ఏదయితేనే తను తలపెట్టిన కార్యం ముందుకెళ్ళడం లేదు. మహారాజుకెలా ఈ కబురు చెప్పించాలి? మహారాజుకి మెల్లగా సర్ది చెప్పగలగాలి. లేకపోతే తనమీద ఆగ్రహిస్తాడు.

వేదరాయశర్మ ఉలుకూ పలుకూ లేకుండా అలా స్థంభానికానుకొని ఆలోచించడం చూసిన ఒక అధికారి దగ్గరకొచ్చి అన్నాడు.

"అయ్యా! ఇప్పుడేం చేద్దామమటారు? మహారాజువారికి ఏం చెప్పమంటారు?"

"అదే ఆలోచిస్తున్నాను. నా శిష్యురాలు ఇలా ఎదురుచెబుతుందనుకోలేదు. ఈ కానుకలు కూడా తిరిగిచ్చేసారంటే ఈ వివాహం జరిగుతుందని నేననుకోను. మహారాజుకీ విషయం మెల్లగా సర్ది చెప్పాలి. ఏం చెయ్యాలో పాలుపోడం లేదు." తలదించుకునే అన్నాడు.

"పోనీ మీరు విజయనగరం వచ్చి మహారాజుకి జరిగింది విన్నవిస్తే మంచిదని నాకు తోస్తోంది. మీ మాటని మహారాజు గౌరవిస్తారు. ఏదో ఒక కారణం సర్ది చెప్పగల సమర్థులు మీరే! మా వల్ల కాదు. ఈ పరిస్థితుల్లో మీరు రావడమే ఉచితంగా కనిపిస్తోంది." అంటూ సలహా చెప్పాడు.

మిగతా అధికారులూ ఈ ప్రతిపాదనకి వంత పాడారు. వేదరాయశర్మ భార్య కూడా దీనికే వత్తాసు పలికింది. ఇంతమంది చెబుతూండడంతో విజయనగర ప్రయాణానికి సిద్ధమయ్యాడు వేదరాయ శర్మ. తక్షణమే బయల్దేరి వెళదామని ప్రయాణానికి సిద్ధంకమ్మనమని ఆదేశించాడు. అంతగా నేహల మనసు మారితే శిష్యులెవరిచేతయినా ఆ వార్త అందించమని భార్యకి చెప్పాడు.

"మరి ఈ కానుకలు?" అధికారి బయల్దేరబోతూండగా ప్రశ్నించాడు.

"ఏం చేస్తాం? మనతోనే తిరిగి తీసుకెళదాం. మహారాజు పంపిన కానుకల్ని తిరస్కరించడం విజయనగర చరిత్రలోనే లేదు. హరీంద్రకీ, నేహలకీ అర్థం కావడంలేదు. పిచ్చుక కొండని ఢీకుంటే ఎవరికి నష్టం?" బాధగా అన్నాడు.

ఈ సంఘంలో ఎక్కడోక్కడ ఎవరో ఒకరు మొదలు పెట్టాలి. విజయనగర రాజ్యంలో అది ఆనాడే మొదలయ్యింది; అదీ ఒక పంతొమ్మిదేళ్ళ అమ్మాయి ద్వారా!

**000000000**

(కొనసాగింపు వచ్చేసంచికలో)

ఈ నవల క్రిందటి భాగాలు ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంధాలయాన్ని సందర్శించండి..




Click here to go to KOUMUDI Library

**NEW**
Click here to share your comments on this serial